# బంధితుడు

శ్రీరాముని మందిరం గాఢాంధకారంలో ఉంది. దీపం వెలిగించే సాహసం కూడా చేయలేదెవరూ.

ఆ రాత్రి రాముని ఒంటరితనాన్ని భగ్నం చేసే సాహసం లేదెవరికి. రాత్రి గడుస్తోంది.

రాముని పక్కన సీత లేదనీ, మరి రాదనీ తెలిసినా సూర్యోదయమవుతుంది. పక్షులు పాడతాయి. పూవులు వికసిస్తాయి. అది ప్రకృతి ధర్మం.

ప్రకృతి ధర్మం మారదు. మారితే ప్రపంచానికి ప్రళయమే.

మానవ ధర్మాలు మారతాయి. మనుషులే మారుస్తారు. ఆ మార్పులకు తట్టుకోలేక తల్లకిందులవుతారు. నెమ్మదిగా అలవాటు పడతారు. అలవాటు స్థిరమయ్యాక మళ్ళీ మార్పు కోరుకుంటారు. మానవధర్మం కాలధర్మమవుతుంది. కాల ధర్మం మానవ ధర్మమవుతుంది. ఈ రెండు మార్పుల సంధి సమయంలో ఆ మార్పులకు కీలకంగా ఉన్న వ్యక్తుల జీవితాలు తల్లకిందులవుతాయి.

రాముడిప్పుడు అదే పరిస్థితిలో ఉన్నాడు.

ఆర్య ధర్మ పరిరక్షణ పరివ్యాప్త బాధ్యతను బాల్యం నుంచీ గురువులు రాముని చేతిలో ఉంచారు.

రాజ్యం గురించి, రాజధర్మం గురించి, పాలన గురించి, ప్రజల గురించి క్షాత్ర ధర్మాల గురించి రాముడిని పారంగతుడిని చేశారు.

ఆ ధర్మమే ఇపుడు రాముని కంఠంలోంచి హృదయంలోకి జారుతుంది. అది గరళంలా ఉంది.

శివుడు గరళాన్ని కంఠంలో నిలిపితే లోకకల్యాణమైందంటారు.

శ్రీరాముడు గరళాన్ని మింగితే తప్ప లోక కల్యాణం జరగదన్నారు.

రాముడు మింగాడు.

భరించలేని యాతన. హింస.

ఒంటరితనం. భయంకరమైన ఒంటరి తనం.

చిన్నతనంలో చిలిపి చేష్టలు ఏం చేశాడో, తమ్ముళ్ళతో కలిసి ఏం ఆటలు ఆడాడో-

తనకు బాల్యం దూరమవుతున్న కొద్దీ తన చుట్టూ ఎవరూ ఛేదించలేని ఒక అధికార వలయం నిర్మితమవుతూ వచ్చింది.

యువరాజుగా, కాబోయే మహారాజుగా తప్ప అన్ని అనుబంధాలు, ఆత్మీయతలు ఉన్న మనిషిగా తనకు గుర్తింపు తగ్గిపోయింది.

గురువుల పట్టు తనపై బిగుస్తున్న కొద్దీ మిగిలిన వారితో తన దూరం పెరిగింది. తను ఎలా నవ్వాలి, ఎలా నడవాలి, ఎవరితో ఎంతసేపు మాట్లాడాలి, ఏ పూజలు, ఏ హోమాలు ఎలా చేయాలి- రాజ ధర్మాలేవి, పుత్ర ధర్మాలేవి, క్షాత్ర ధర్మాలేవి, తన వంశ చరిత్ర ఏమిటి- ఎటువంటి మహానుభావులు తమ రఘువంశంలో జన్మించారు? వారి వారసునిగా తనేం చెయ్యాలి?

ఈ విచార ధార తనను క్రమంగా పడదోసుకు పోవటం ప్రారంభమైంది.

లక్ష్మణుడు కూడా తన భుజంపై చేయి వేయటం మానేసి తనకు నమస్కరించటం మొదలు పెట్టాడు.

తన సరసన నడిచేవాడు కాస్తా తన వెనుక నడవటం ప్రారంభించాడు.

ఆ సమయంలో విశ్వామిత్ర మహర్షి అడగని వరంలా వచ్చి కొన్నాళ్ళు తనను అరణ్య ప్రాంతాలకు తీసుకువెళ్ళాడు.

అరణ్యంలో మళ్ళీ లక్ష్మణుడు, తను చేయీ, చేయీ కలిపి తిరిగారు. కలిసి నవ్వుకున్నారు. ఆశ్చర్యపడ్డారు.

ఆ తర్వాత- ఆ తర్వాత-

ఆ తర్వాత ఈ సమస్త సృష్టి తన కోసం పంపిన కానుకగా భూపుత్రి సీత పాణీ గ్రహణం.

అపురూపమైన స్నేహితురాలు. తన ఒంటరితనం పోగొట్టిన సఖి.

తమ ఏకాంత మందిరంలో ఎవరి ఆజ్ఞలకూ లోబడకుండా స్నేహం చేయగలిగిన సీత తన పాలిటి దేవత.

కానీ త్వరలోనే భార్యకు కూడా చెప్పకూడని విషయాలుంటాయనే ఉద్భోదలు మొదలయ్యాయి.

సీతకు ఏర్పడే పరిమితులు ఆమెకూ ఏర్పడ్డాయి.

ఎన్నో ఆటుపోట్లు- పరీక్షలు-

అంతా చక్కబడి స్థిమితం చిక్కిందనుకున్నపుడు-

తండ్రి కాబోతున్న గర్వంతో పొంగిపోతున్నపుడు-

శాశ్వత సీతా వియోగం.

రాముని కళ్ళు రక్తపద్మదళాల్లా ఉన్నాయి.

ఆ కళ్ళముందుకు లక్ష్మణుడు వచ్చి నిల్చున్నాడు.

ఇరువురికీ తెలుసు.

లక్ష్మణుడు రాముడు అప్పగించిన కార్యభారం దించుకుని వచ్చాడు. కానీ మనసు సీసపు గుండులా బరువెక్కి ఉంది.

ఇద్దరూ మౌనంగా కన్నీరు కారుస్తున్నారు.

"అన్నా నువ్వు చక్రవర్తివి కంటనీరు పెట్టరాదు." లక్ష్మణుడు గొంతు పెకలించుకుని అన్నాడు.

"దుఃఖించే స్వేచ్ఛ కూడా లేదా లక్ష్మణా. నేను పూర్తిగా శృంఖలాబద్ధుడినని నాకు తెలుసు. కానీ కన్నీళ్ళు సంకెళ్ళకు లొంగవు. లోహ హృదయాన్ని ఛేదించుకు వస్తున్నాయి. లక్ష్మణుడు ఆగలేక అన్నగారి భుజం మీద చేయివేసి మరో చేత్తో కన్నీరు తుడిచాడు.

"ఎందుకిలా జరుగుతోంది రామా" లక్ష్మణుడి కంఠం నిండా దుఃఖం.

"ఇలా తప్ప ఇంకొకలా జరిగే వీలే లేదు. నా జీవితం అధికారం కింద అణిగిపోవలసిందే. మన తల్లి కైకేయి వల్ల పదమూడు సంవత్సరాలు అరణ్యంలో సీతతో స్వేచ్ఛగా జీవించగలిగాను. అంతే.

నా జీవితంలో సీతతో హాయిగా గడిపిన సమయం కైకేయి వర ప్రసాదితం. ఆమెకు నేనెంత ఋణపడి ఉన్నానో మీకెవరికీ తెలియదు. ఈ అధికారం నుంచీ, సింహాసనం నుంచీ నన్ను విముక్తం చేసి పంపింది. ఆ రోజు కూడా నేను సంతోషం గానే వెళ్ళాను. గుర్తుందా లక్ష్మణా" లక్ష్మణుడు ఆశ్చర్యపోయాడు అంత దుః ఖంలోనూ.

"అన్నా మీరు మీ కోసం దుఃఖిస్తున్నారా– మా వదినను ఇప్పుడే అరణ్యాలలో ఒదిలివచ్చాను ఆమె గతి ఏమి కానున్నదో."

"నేనూ సీతా వేరు కాదు లక్ష్మణా. అది మీకెవరికీ తెలియదు. మా ఇద్దరి కోసం దుఃఖిస్తున్నాను. సీతకే అపాయమూ జరగదు. ఆమె భూపుత్రి. సమర్థురాలు. సుపుత్రుడిని కని ఆ పాపడి పెంపకంలో మాధుర్యాన్ని ఆసాంతం అనుభవిస్తుంది. నేను అసమర్థుడిని. నా పురుషోత్తమత్వమే నా అసమర్థత. ఈ రాజ్యాధికారంతో నేను నామీది అధికారాన్ని పోగొట్టుకున్నాను. నా సీతను పోగొట్టుకున్నాను. నా పుత్రుడిని దూరం చేసుకున్నాను." రాముడి దుఃఖం భరించగలిగే శక్తి లక్ష్మణునికి లేకపోయింది.

* * *

అధికారం ఒదలటం రాముని చేతిలో కూడా లేదు.

రాజ్యం ఒదలటం రాముని ఒక్కడి ఇష్టం కాదు.

రాముడు ఎలాంటి సంకోచాలూ లేకుండా పట్టాభిషిక్తుడు కావటానికి పరమానందంగా సిద్ధమైనరోజు అతనికి అది దక్కలేదు.

దక్కకుండా పని చేసిన శక్తులేమిటో తెలుసుకునే వ్యవధానం లేదు. ఆర్య ధర్మమైన పితృవాక్య పరిపాలనమనే అత్యుత్తమ కర్తవ్యం నిర్వహించే అవకాశం కలిగిందని పొంగిపోయాడు. అరణ్యానికి బయలుదేరే ముందు వశిష్టుడు సాదరంగా చెప్పాడు.

"రామా! నువ్వు రఘువంశ వారసుడివి. పధ్నాలుగేళ్ళు రాజ్యం వదులుతున్నావంటే రాజధర్మాన్నీ, క్షాత్ర ధర్మాన్ని ఒదులుతున్నావని అర్థం కాదు. సీతా కల్యాణ సమయంలో పరశురామునికిచ్చిన వాగ్దానం గుర్తుంచుకో. దక్షిణాపధమంతా ఆర్య ధర్మాలను విస్తరించు. సమస్త భూమండలమూ ఆర్య సామ్రాజ్యమైపోవాలి."

రాముడికీ అంతా గుర్తువచ్చింది.

సీతతో వివాహం జరగటానికి క్షత్రియ సంహారకుడైన పరశురామునితో జరిగిన ఒప్పందం గుర్తొచ్చింది.

పరశురాముడు ప్రళయకాల అగ్నిజ్వాల వలె మండిపోతూ వచ్చాడారోజు. రాముడప్పుడు సీతా నామ స్మరణ తప్ప మరో స్పృహ లేకుండా ఉన్నాడు. సీత, జానకి, వైదేహి, మైథిలి– ప్రతి పేరూ తన మనసులో అమృతం కురిపించింది. మేలిముసుగులోని ఆమె దృశ్యాదృశ్య సందర్శనంతో తన తనువు మలయ మారుతమై తేలిపోయింది. సుఖ పూరిత భారరహిత స్థితి మొదటిసారి అనుభవించాడు.

శివధనుస్సు విరవటం– సీత తన మెడలో విరిదండ వేయటం అంతా ఒక తన్మయావస్థలో జరిగాయి.

అప్పుడు పరశురామునితో మాట్లాడగలిగిన స్థితి లేదు. పెద్దలందరూ తనకు అడ్డుగా నిలిచారు.

క్షత్రియులను భూమి మీద బతకనీయనన్న ఆ ముని ప్రతాపం ప్రతీకారం తెలియనిదెవరికి?

బ్రహ్మర్షులూ, రాజర్షులూ మంతనాలు సాగించారు. రాముడినీ పిలవనంపారు.

"ఆర్య ధర్మాలను ఉత్తర దక్షిణాపథాలలో సుస్థిరంగా నిలబెడతానని మాట ఇస్తే సీతారాముల కల్యాణం జరుగుతుంది" పరశురాముడి కరకు కంఠం పలికింది.

"ఆర్య ధర్మాలంటే నాకు తెలియనివి కావు. వశిష్టాదిమునుల శిక్షణలో నేనవి అభ్యసించాను. మా రాజ్యంలో అవి అమలు జరుగుతున్నాయి." రాముడు ఒకింత ఆశ్చర్యంతో వినయంగానే చెప్పాడు.

"మరింత కఠోరంగా, దీక్షతో, విస్తృతంగా అమలు చేయాలి" రాముడు ఏం మాట్లాడి పరశురామునికి కోపం తెప్పిస్తాడోనని దశరథుడు రాముని తరఫున వాగ్దానం చేశాడు.

రాముడు మాట్లాడబోతుంటే–

"పితృవాక్య పరిపాలన ఆర్యధర్మాలలో ఉత్తమమైనది. ముందు దానిని పాటించు" అన్నాడు పరశురాముడు.

అందరూ నిశ్శబ్దమైపోయారు.

సీతారాముల కల్యాణం జరిగింది.

వశిష్టుడదంతా రాముడు అరణ్యవాసానికి బయలుదేరేటప్పుడు గుర్తుచేసి హెచ్చరించి పంపాడు.

* * *

రాముని ఆలోచనలలో అరణ్యవాసపు రోజులు పురివిప్పిన నెమళ్ళలా ప్రవేశించాయి. పదమూడు సంవత్సరాల అరణ్యవాసమే తన జీవితంలో మర్చిపోలేని మధురమైన అనుభూతుల నిచ్చిన కాలం. ముఖ్యం సీతతో గడిపిన అనురాగపు వత్సరాలవి. నదీజలాల మీదుగా వీచే చల్లని గాలులు, మత్తెక్కించే అరణ్య పరిమళాలు, రకరకాల పక్షుల కలరవాల మధ్య ముద్దు మురిపాలతో సాగిన ప్రణయం. సీతను కన్నులలో దాచుకున్న రోజులు. సీత ఒడిలో అనురాగపు నయగారాలలో పరవశించిన రోజులు. ఒకరిద్దరు అనార్యులను సంహరించటం, అక్కడి మునుల ద్వారా ఆర్యధర్మాల ప్రచారం చేయించటం తప్ప మరో పనేదీ లేని కాలం. అంతఃపురాలలో, రాజసభలలో నిత్యం వినబడే, హెచ్చరికలు లేని కాలం. 'ముక్కూ ముక్కూ' రాసుకునే పిట్టల్లా, ముచ్చటలాడుకున్న కాలం. ఒకరివెంట ఒకరు లేళ్ళలా పరిగెత్తిన కాలం. చంద్రుడు ఉదయించేది, నక్షత్రాలు వెలిగేది, పూలు పూసేది, గాలులు వీచేది అంతా సీతారాముల కోసమే. సెలయేళ్ళు తమ జలకాలకే తుళ్ళింతలాడుతుండేవి. అడవి తమను ఆప్యాయంగా ఒడిలోకి తీసుకుని ఆటలాడు కొమ్మనేది.

అలాంటి సంవత్సరాలలో కూడా అపుడపుడూ అయోధ్య నుంచి ఆదేశాలు. ఆర్య సామ్రాజ్య విస్తరణ గురించి. సుగ్రీవునితో స్నేహం, రావణునితో వైరం తప్పనిసరి అనే ఆదేశాలు. సందర్భం కుదరాలిగదా అనుకునేవాడు తను. శూర్పణఖ వచ్చిన రోజు సందర్భం వచ్చింది. ఆరోజు తను రాజధర్మం నిర్వర్తించాడు. శత్రువుని, జయించాల్సిన శత్రువుని యుద్ధానికి కవ్వించటం ఆర్య రాజధర్మం. అవకాశం శూర్పణఖ రూపంలో వచ్చింది. తన సోదరిని అవమానిస్తే రావణుడు యుద్ధానికి తరలివస్తాడని పాలనా అనుభవం లేని తను అనుకున్నాడు.

రావణుడు చాలా అనుభవజ్ఞుడు రాజనీతిలో, యుద్ధతంత్రంలో. సముద్రం దాటి సైన్యాలతో వచ్చి తనదికాని చోట యుద్ధానికి తలపడే అమాయకుడు కాదు. సీతను, తన కంటిపాపను అపహరించుకు వెళ్ళాడు. తను సముద్రాన్ని దాటివెళ్ళి స్థానబలిమి లేనిచోట జయించలేనని రావణుని ఆలోచన. కానీ సీత కోసం ఒక్క సముద్రం కాదు సప్త సముద్రాలు దాటే శక్తి తనకుంది- ఆ సంగతి రావణునికి తెలుసో తెలియదో.

తెలిసినా తెలియకున్నా రావణ సంహారం జరిగింది. దానికి ముందే గాలిలో వార్తలు. సీతను అయోధ్య తీసుకురావటం ఆర్యధర్మమేనా అని.

సీత లేకుండా అయోధ్యకా? ఆర్య సామ్రాజ్యాన్ని నెత్తిన పెట్టుకు ఊరేగటానికే కాదు తానింత యుద్ధం చేసిందని ఎవరూ నమ్మకపోయినా సీత నమ్ముతుందనుకున్నాడు తను.

కానీ సీతను అయోధ్య తీసికెళ్ళి అక్కడ ఆమెను అందరి ముందూ అవమానించాలా-

ఆ మాటలు సీత వినాలా-

సీత పవిత్రత అయోధ్యా పుర ప్రముఖులందరి ముందూ నిరూపించాలంటే సీత తట్టుకుంటుందా!

కానీ సీత శీలనిరూపణ జరగందే అయోధ్య అంతఃపురం ఆమెను గౌరవంగా సాదరంగా ఆహ్వానించదు.

ఆ సంగతి తనకు బాగా తెలుసు.

అంతా లంకలోనే పరిష్కారం కావాలనుకున్నాడు.

అగ్ని పరిక్ష- తన సీతకు.

తనకోసం కేవలం తనకోసమే అంగీకరించిందా అభిమానవతి.

సీత పాదాలమీద పడి శరణు కోరటం తప్ప గత్యంతరం లేని పరిస్థితి అనుకున్నాడు.

కానీ సీత తనను అర్థం చేసుకుంది. ఈలోక ధర్మాలనుంచి రాజ ధర్మాల నుంచి తనను రక్షించదల్చుకుంది. నేనున్నాను నీకు రామా అని చెప్పదల్చుకుంది.

అవమాన దుఃఖ సముద్రాలను రెండు కళ్ళలో దాచుకుని తొణకని జలభాండంలా వచ్చి అగ్నిని చల్లార్చింది.

'నన్ను క్షమించకు సీతా' అన్న మాటలను తను పెదవుల్లోనే దాచుకున్నాడు. సీత పెదవులు ఆ మాటను సున్నితంగా తీసివేశాయి.

అంతా శుభమేననుకున్నాడు తను అమాయకంగా.

సీత కన్నులలో అప్పుడే ఒక విషాద ఛాయ ఏర్పడింది. తనకు తెలుసు. తనకోసం తన రక్షణ కోసం సీత గాయపడింది.ఆ గాయాన్ని తన ప్రేమతో, కాల మహిమతో మాన్పగలననుకున్నాడు. ఇప్పుడు, ఇవాళ ఆ గాయాన్ని మళ్ళీ కోసి మరి మానే అవకాశం లేకుండా చేసి పంపాడు.

హృదయం నుంచి నిరంతరం అవమాన రక్తస్రావం జరిగేలా చేశాడు.

మానని గాయం.

నిత్యం సలపరించే గాయం.

సీతారాముల ప్రేమకు సింహాసనం చేసిన గాయం.

సీతను త్యజించగలడు. సీత తనది.

రాజ్యాన్ని త్యజించలేడు. అది రఘు వంశానిది.

వంశం. వంశ పారంపర్యంగా ప్రథమ కుమారునికి సంక్రమించే రాజ్యాధికార సంప్రదాయం. దానిని నిలబెట్టే ఆర్యధర్మం తన తలమీద. ఈ ధర్మ రక్షణ భారం చివరకు తన జీవితానందాన్నంతా హరించి వేసింది.

విముక్తి లేదు తనకు.

రాముడలా విలపిస్తూనే ఉన్నాడు.

* * *

అరణ్యాలనుంచి వచ్చిన ఇద్దరు మునిబాలకులు రామాయణగానం చేస్తున్నారని విని వాళ్ళను అన్నగారికి చూపించాలని తలచాడు లక్ష్మణుడు.

రాముని దర్శనం ఇపుడు లక్ష్మణునికైనా అతి కష్టం.

అతను చక్రవర్తి. సింహాసనాధిష్టుడు. కిరీట ధారి.

అవి తప్ప అతనికింకో ధ్యాస లేదు. లోకం లేదు

తల్లులు, తమ్ములు, బంధుగణాలు అందరికీ అతను రామచంద్ర మహారాజు.

సీతా వియోగాన్ని మరవటానికి రాముడిలా మరమనిషిలా మారాడా లేక మరమనిషిలా మారక తప్పదని దానిని సీత భరించలేదని తెలిసి సీతను వనాలకు పంపాడా అని అనుమానం వస్తుంది లక్ష్మణునికి, ఆంజనేయునికి.

ఎప్పుడైనా రాముని చిరునవ్వు చూద్దామని ప్రయత్నిస్తుంటారిద్దరూ. కానీ అధికారానికీ వాత్సల్యపూరితమైన చిరునవ్వుకి ఆజన్మ విరోధమని వారికి తెలియదు.

రాజ్యపాలన సాగుతోంది. రాజ్యపాలనకు కరకు కత్తులు కావాలి. వాటికే విలువ ఇప్పుడు.

ఈ మునిబాలకులను చూస్తే రాముని హృదయం కరగవచ్చునిపించింది లక్ష్మణునికి.

వారి సంగీతం మధురం. వదనారవిందాలు మధురం. వాక్కులు మధురం. శిలగా మారిన రాముని కరిగించేందుకు వీరి గానామృతం సరియైన ఔషధమనిపించింది లక్ష్మణునికి. రాముడు నిర్లిప్తంగా తమ్ముని మాటలు విన్నాడు.

రామ కథను గానం చేస్తారు. అధికార శృంఖలాబద్ధుడైన రామకథ వాళ్ళకేం తెలుసని గానం చేస్తారు?

చందమామ కావాలని మారాం చేస్తే అద్దంలో చందమామను చూపి మాయచేశారు. అది గానం చేస్తారు.

సీత కావాలని మారాం చేసే అవకాశం లేకుండా సింహాసనానికి కట్టుబడిన రామకథని గానం చేస్తారా?

సీతారామ కల్యాణం కమనీయంగా గానం చేస్తారు.

శాశ్వత సీతా వియోగంలో వేగుతున్న రామకథను గానం చేస్తారా?

రావణ సంహారుడైన రాముని గురించి గానం చేస్తారు. తనలోని ప్రేమను తాను సంహరించుకున్న రాముని కథను ఆ పసిబాలురు గానం చేయగలరా?

రాముడి ముఖం వివర్ణమవుతుంటే లక్ష్మణుని ఆశలు అడుగంటాయి.

"అన్నా ఈ ఒక్కసారి నా మాట మన్నించు. దహించుకుపోయే నీ మనసుకు నవనీతమవుతుంది వారి గానం.

"మనసా? నాకా? దహించుకు పోవటమా?"

"మండుతున్న మెదడుకి శీతలామృతమవుతుంది వారి గీతం."

"మెదడా? నాకా? ఆర్య ధర్మాలను ఆలోచించకుండా, ఆలోచించే పని పెట్టుకోకుండా గుడ్డిగా అమలు చేసేనాకు మెదడా?"

"అన్నా- నా కోసం"

లక్ష్మణుడు రాముని పాదాలు తాకాడు.

రాముడు అంగీకార సూచకంగా తల ఊపాడు.

ముఖ్యులతో కొలువు దీరిన రామునికి దగ్గరగా వచ్చి నమస్కరించారు లవకుశులు. రాముడు వారిని చూసి విచలితుడయ్యాడు. స్పష్టంగా కనపడుతున్న తన ప్రతిబింబాలు. మునివేషాలలో దాగిన రాకుమారులు. రామునికంతా స్పష్టమైంది. బాలురను దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకున్నాడు. సభలోని ముఖ్యులకూ అంతా తేట తెల్లమైంది. ధర్మచర్చలో రాముడు పుత్రులను స్వీకరించవచ్చని తీర్మానం జరిగింది.

'మరి సీత?'

ధర్మచర్చ మళ్ళీ మొదలయింది.

"సభలో నిర్దోషినని చెప్పుకుంటే రాముడు స్వీకరిస్తాడ" నే వార్త తీసుకుని వాల్మీకి తన ఆశ్రమానికి బయలు దేరాడు.

సీత రాదని రామునికి తెలుసు.

పుత్రులనిచ్చి, వారి ఆలింగన సౌఖ్యాన్నిచ్చి సీత ఎప్పటిలాగే తనను రక్షించింది.

శిలను కరిగించింది. మోడును చిగురింప చేసింది.

తను కూడా ఎప్పటిలాగే సీతకు మరింత దుఃఖాన్ని మిగిల్చాడు. ఎప్పటికప్పుడు ఏదో ఒక ఆసరాతో పైకి లేచే లేత తీగను, క్రూర మృగ పద ఘట్టన నేల రాసినట్లు, ప్రతిసారీ జీవితేచ్ఛ పెంచుకున్న సీతకు ఆ ఇచ్ఛ నశింప చేస్తున్నాడు.

సీత రాదు. ఈ పిల్లలను తనకప్పగించి తను విముక్తురాలవుతుంది. తను రఘువంశ వారసులను తయారు చేసిన తర్వాత గాని విముక్తుడు కాలేడు.

కానీ పుత్రులనిచ్చి సీత తనకు విముక్తి మార్గం తెరిచింది. సీత ఎప్పుడూ తనకు అండగానే ఉంది. తనను రక్షిస్తూనే ఉంది. అయోధ్యలో అందరూ శ్రీరామరక్ష అంటారు.

శ్రీరామునికి సీత రక్ష అని ఎవరికి తెలుసు?

---

రచన మాస పత్రిక జూలై 2010